


అంతా క్షణంలో జరిగిపోయింది!

సాయంకాలం. అంచేత జనం రోడ్డుమీద కాస్త జోరుగానే తిరుగుతున్నారు. సైకిళ్ళూ-రిక్షాలూ, స్కూటర్లూ, కార్లూ, లారీలూ హడావుడిగా పోతున్నాయి - ఒకదాంతో మరోదానికి సంబంధం లేకుండా.

ఎప్పుడొచ్చాడో ఏమిటో మూడేళ్ల ఆ పిల్లవాడు రోడ్డుమీదకు. ఎర్ర నిక్కరు మీద తెల్ల జెర్సీ బన్నీను వేసుకున్నాడు. రోడ్డు పక్క ఫాన్సీషాపులో తల్లి ఏదో బేరం చేస్తూన్నది. నిశ్శబ్దంగా తల్లిపైట చెంగువొదిలి, పేవ్‌మెంట్‌మీదకొచ్చాడు. ఆ పేవ్‌మెంట్ మీదనుంచి ఈ పేవ్‌మెంట్ మీదకు రావాలని ఆ పిల్లవాడికి ఎందుకు బుద్ధిపుట్టిందో, ఆభగవంతుడికే తెలియాలి మరి.

రోడ్డు మధ్యకు వచ్చాడో లేదో-అటు బెంజి లారీ హారన్, ఇటు ఎంబాసిడర్ కారు హారన్-మధ్యలో బీట్ పోలీస్ విజిల్! లారీ బ్రేకులు కేకలు పెట్టాయి. కారు బ్రేకులు కిక్కురు మనలేదు.

ఆ పిల్లవాడు కుఁయ్ కఁయ్ మనలేదు. కారు చక్రాలకింద నెత్తురుముద్దయి పడివున్నాడు.

ట్రాఫిక్ బంద్. క్షణంలో రోడ్డుమీద జనమంతా ఆ పిల్లవాడి చుట్టూ చేరారు. "అయ్యో పాపం! పసిగుడ్డు" అంటూ వాపోయారు కొంతమంది; "మూడేళ్లకే నూరేళ్ల బతుకు వెళ్ళమారింది" అనుకొన్నారు మరికొంతమంది; "ఆకారువాణ్ణి పట్టుకోండి! చితక్కొట్టండి" అంటూ కేకలు వేశారు కుర్రకారు.

ఆ కారు డ్రైవింగ్‌సీట్లో ఉన్నది ఆ టవున్లో కెల్లా షావుకారైన ఓ వ్యాపారవేత్త ఒకేఒక్క కొడుకు. అతనికి ముచ్చెమటలు పోసినయ్; గుండెలో భయం చీకటిలా జడలు విప్పుకొంది. జైలు కటకటాలు కళ్లముందు నిల్చాయి. వచ్చే

నెలలో అతనికి పెళ్ళి కావాల్సివుంది- ఓ కోటీశ్వరుని కూతురుతో.

పోలీసు వచ్చాడు. పాకెట్ లో నుంచి నోట్ బుక్ తీశాడు. కారు నెంబరు నోట్ చేసుకున్నాడు. కారుతోలిన యువకుణ్ని పేరూ, అడ్రసూ అడుగుతున్నాడు. ఆ యువకుడు నిలువెల్లా వణికిపోతున్నాడు. నోటమాట రావడంలేదు. డబల్ నిటెడ్ స్ట్రెచ్ లాన్ ప్యాంట్ జేబులో చేయి పెట్టాడు. అయిదువందల రూపాయల నోట్లున్నాయి. వాటిని పోలీసుకిస్తే? ... ఎట్లా ఇవ్వడం? అసలే జనం ఉద్రేకంగా వున్నారు. ఏ క్షణంలోనైనా తనమీద పడొచ్చు. నాన్నకు ఫోన్ చేస్తే? ... ఈ వ్యవహారం ఆయనే చూసుకుంటాడు. ఎట్లా బయటికి పోవడం? కదిలితే తన్నేట్టు ఉన్నారు......

వలయంగా గుంపు ఏర్పడింది. ఎవరి నోటికొచ్చినట్టువాళ్ళు మాట్లాడుతున్నారు.

వీధిదీపాలు ఒక్కసారిగా వెలిగాయి.

కారు చక్రం కింద నెత్తురుమడుగులో పిల్లవాడు చచ్చిపడున్నాడు.

గుంపును నెట్టుకొంటూ ముప్ఫైయేళ్ల ఓ స్త్రీ వచ్చింది. సన్నగా, పాలిపోయి ఉంది, చనిపోయినపిల్లవాడికేసి తీక్షణంగా చూసింది.

"కళ్లు మూసుకుపోయి కారుతోలితే ఇట్లాంటి యాక్సిడెంట్లు ఎందుకు జరగవు?" అన్నారెవరో.

"తప్పు కారుతోలిన వాళ్లదు కాదు." అన్నదామె గంభీరంగా.

"మరెవరిది? మీరు చూశారా?" అన్నారు ఇంకొకరు.

"నేను చూడలేదు.షాపులో ఉన్నాను" అన్నదామె.

"పిల్లవాడు ఎవరో?" అన్నారు ఒకరు.

"మా అబ్బాయి" అన్నదామె,

అందరూ ఆశ్చర్యంతో కనుబొమలు ఎగురవేశారు.

"తప్పు నాదే? . . . ముమ్మాటికీ నాదే!" అంటూ అరిచిందామె బిగ్గరగా.

పోలీసు నిర్విణ్ణుడై, నోట్ బుక్ జేబులో పెట్టుకున్నాడు.

ఆమె పిచ్చిదేమో అనుకొన్నారు. కొంతమంది.

ఆమెకు అక్రమంగా పుట్టిన బిడ్డ దేమో అనుకొన్నారు మరికొంతమంది.

షావుకారుగారి అబ్బాయి వద్ద పది వేలు పుచ్చుకోవాలని నాటక మాడుతుందేమో అనుకొన్నారు ఇంకా కొంత మంది.

కాని, మూడేళ్ల ఆ పిల్లవాడికి పుట్టినప్పుడే కళ్ళుపోయాయన్న సంగతి ఆ తల్లికే తెలుసు.

---